సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

I

గురువారం । 2 । నవంబర్ । 2023





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మంత్రివర్యులు
శ్రీ మేకపాటి గౌతమ్ రెడ్డి గారి
కాంస్య విగ్రహ ఆవిష్కరణ ఆహ్వానం





ప్రారంభకులు : శ్రీ కాకాణి గోవర్దన్ రెడ్డి గారు
వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు
ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, వాణిజ్యం, చేనేత, జౌళిశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా మెట్ట ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేసి, పారిశ్రామికాభివృద్ధికి దోహదపడిన దివంగత మంత్రివర్యులు శ్రీ మేకపాటి గౌతమ్ రెడ్డి గారి జయంతి సందర్భంగా వారికి మా

ఘన నివాళులు....



తేది : 02.11.2023 గురువారం
సమయం : ఉదయం 10 గంటలకు
స్థలం : డైకస్ రోడ్ సెంటర్,
పొదలకూరు రోడ్, నెల్లూరు

ఆహ్వానించు వారు
మేకపాటి కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

పేకాట కేంద్రంపై దాడి



పట్టుబడిన జూదరులతో ఇన్‌స్పెక్టర్ బాజీ

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై నవాబుపేట పోలీసులు దాడులను బుధవారం నిర్వహించి ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ వేణు కొంతకాలంగా తన ఇంట్లోనే గుట్టుచప్పుడు కాకుండా పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ బాజీకి పక్కా సమాచారం అందింది. తన సిబ్బందితో కలిసి సదరు ఇంటిపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో పేకాట కేంద్రంపై దాడి చేసి నిర్వాహకుడితో పాటు మాగుంట లేఅవుట్‌కు చెందిన బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్, బాలాజీనగర్‌కు చెందిన రవికుమార్, అల్లూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి, జెండావీధికి చెందిన రబ్బానీ, దాచూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి, నెల్లూరుకు చెందిన రమేష్‌బాబు, లక్ష్మీనారాయణను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.55,600 నగదు, రెండు కార్లు, బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి అక్రమ రవాణాపై దాడులు

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- రూ.ఎనిమిది లక్షల విలువజేసే గంజాయి, రూ.95 వేల నగదు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ హిమవతి

నెల్లూరు(క్రైమ్): గంజాయి అక్రమ రవాణాపై ఎస్‌ఈబీ అధికారులు కావలి, ముసునూరు ప్రాంతాల్లో దాడులు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి వీరి నుంచి రూ.ఎనిమిది లక్షల విలువజేసే గంజాయి, రూ.95 వేలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ నెల్లూరు – 1 స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఏఎస్పీ హిమవతి బుధవారం వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాళెం, కావలి, డీఎస్‌ఈటీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి కావలి, ముసునూరు ప్రాంతాల్లో దాడులను మంగళవారం చేపట్టారు. ముసునూరు క్రాస్‌రోడ్డు వద్ద బ్యాగ్‌లతో అనుమానాస్పదంగా ఉన్న అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రవడిపల్లికి చెందిన నాగేంద్ర, హరికృష్ణ, చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన సలీమ్‌బాషా, పూతలపట్టు మండలం బండపల్లికి చెందిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బ్యాగ్‌లను పరిశీలించగా 12 కిలోల గంజాయి, రూ.95 వేల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని నామక్కల్ జిల్లాకు చెందిన మురగేశన్‌ను అదుపులోకి తీసుకొని అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా, 28 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిందితులను తమదైన శైలిలో విచారించారు. ఆంధ్ర – ఒడిశా సరిహద్దుల్లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నామని తెలిపారు. దీంతో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని, పట్టుబడిన గంజాయి విలువ రూ.ఎనిమిది లక్షలు ఉంటుందని ఏఎస్పీ తెలిపారు.

నిరంతర దాడులు

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతర దాడులను కొనసాగిస్తున్నామని ఏఎస్పీ పేర్కొన్నారు. మూడు, నాలుగు రోజుల వ్యవధిలో 51 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఎస్‌ఈబీ టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని కోరారు.


సిబ్బందికి అభినందన

దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ చూపిన డీఎస్‌ఈటీ పోలీస్ టీమ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, ఎస్సై బాలకృష్ణ, ఎస్‌ఈబీ బుచ్చిరెడ్డిపాళెం, కావలి, నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్లు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, కిశోర్, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. ఎస్‌ఈబీ ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గేదెల మృతి

సంగం: టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన సంగం తిరుమనతిప్ప వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. సంగానికి చెందిన ఓ రైతుకు సంబంధించిన గేదెలు ఎర్ర చెరువు సమీపంలో రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన టాటా ఏస్ ఢీకొంది. దీంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న సంగం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గేదెలను పక్కకు తొలగించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.30
పండ్లు : రూ.7

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్:	రూ.115
లేయర్	రూ.113
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.192

ఈ - శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకోవాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని అసంఘటిత, వలస కార్మికులు తమ పేర్లను ఈ – శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ గౌస్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పోర్టల్లో పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి పలు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీలో షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు సిటీ: జిల్లాలోని వివిధ ఆర్టీసీ బస్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న 37 షాపులకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణాధికారి శేషయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆత్మకూరు డిపో పరిధిలో ఒకటి, కావలి డిపో పరిధిలో తొమ్మిది, నెల్లూరు – 1 డిపో పరిధిలో ఏడు, నెల్లూరు – 2 డిపో పరిధిలో 10, కందుకూరు డిపో పరిధిలో ఏడు, రాపూరు డిపో పరిధిలో మూడు షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులను నవంబర్ 8 వరకు పొందవచ్చని తెలిపారు. నగరంలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్స్‌లో తొమ్మిదో తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు వేయాలని కోరారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు టెండర్ బాక్స్‌ను తెరవనున్నామన్నారు. దరఖాస్తుల కోసం డిపో మేనేజర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

బొల్లినేని, టీడీపీ నేతలపై కేసు నమోదు

జలదంకి: టీడీపీ అధినేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావుతో పాటు తెల్లపాడుకు చెందిన సుబ్బారావు, మరికొందరు జలదంకి మండలంలో రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేశారు. ఓవరాక్షన్ చేస్తున్నారంటూ స్థానిక ఎస్సై ఆదిలక్ష్మితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో వీరిపై కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ఉదయగిరి: ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గండిపాళెంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తోడెందుల కొండమ్మ(49) ఉదయం బీసీ కాలనీలోని తన తల్లి ఇంటి వద్ద నుంచి తన ఇంటికి వచ్చింది. ఇంట్లో చీరతో ఇనుప కొక్కికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామ వలంటీర్ పింఛను నగదు ఇచ్చేందుకు ఇంటికెళ్లగా తలుపునకు లోపల గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా పలకకపోవడంతో తిరిగి వెళ్లిపోయాడు. అనంతరం ఆమె తల్లి వెంకటమ్మ కుమార్తె ఇంటి వద్దకు వచ్చింది. ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో సమీపంలో ఉండే దుకాణాల వారికి విషయం చెప్పింది. వారు వచ్చి తలుపు గడియ తీసి లోపలికి వెళ్లి చూడగా కొండమ్మ ఉరేసుకుని కనిపించింది. కాగా ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మనస్తాపంతో ఉపాధ్యాయుడు..



రవీంద్రబాబు (ఫైల్)

దుత్తలూరు: ఉరేసుకుని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుత్తలూరులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దుత్తలూరుకు చెందిన దుగ్గిన బోయిన రవీంద్రబాబు(37) ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన దుత్తలూరు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా పెదనాన్న కుమారుడు భాస్కర్ చదివించి పెద్ద చేశాడు. గతేడాది రోడ్డు ప్రమాదంలో భాస్కర్ మృతి చెందాడు. అప్పట్నుంచి రవీంద్రబాబు తీవ్ర మనోవేదనతో తాను చనిపోతానని ఇంట్లో చెబుతుండేవాడన్నారు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రవీంద్రబాబు రెండ్రోజులుగా ఆరోగ్యం సరిగా లేదని పాఠశాలకు సెలవు పెట్టి ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం భార్య బుచ్చిరెడ్డిపాళెంలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా రవీంద్రబాబు కింద గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందజేయగా, వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

వెంకటాచలం: వీఎస్‌యూలో వచ్చే నెల్లో నిర్వహించనున్న ప్రీ – పీహెచ్‌డీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎగ్జామినేషన్ (ఎఫ్‌టీ, పీటీ), ఏపీఆర్‌సెట్ – 2020, 21 సంవత్సరాల్లో అడ్మిటైన అనుబంధ రీసెర్చి స్కాలర్స్ మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నెల 21 వరకు సాధారణ ఫీజుతో, 22 నుంచి 30 వరకు అపరాధ రుసుముతో చెల్లించొచ్చని చెప్పారు. పరీక్ష రుసుము రెండు పేపర్లకు రూ.2500, ఒక పేపర్‌కు రూ.1500, ఆలస్యంగా సమర్పించినందుకు రూ.250 అపరాధ రుసుముతో చెల్లించాలని సూచించారు. వీఎస్‌యూ, కాకుటూరు, ఎస్‌బీఐ బ్రాంచ్‌లో చెల్లించిన చలానాతో పాటు పూరించిన దరఖాస్తులను వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్‌కు అందజేయాలని కోరారు.

విద్యుత్ బిల్లుల్లో అశ్రద్ధ తగదు



మీటర్ రీడింగ్‌ను తీస్తున్న సోమశేఖర్‌రెడ్డి


నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో వినియోగదారులకు అందజేసే విద్యుత్ బిల్లుల విషయంలో అశ్రద్ధ తగదని.. సరైన సమయానికి అందించకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సీటీ మీటర్, నాన్ స్లాబ్ విద్యుత్ మీటర్ల రీడింగ్‌లను సిబ్బంది ఏ విధంగా తీస్తున్నారనే అంశమై ఆకస్మిక తనిఖీలను బుధవారం చేపట్టారు. స్వయంగా మీటర్ రీడింగ్ తీసి బిల్లులను వినియోగదారులుకు అందజేశారు. బిల్లులను డిజిటల్ పద్ధతిలో చెల్లించేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు.

బాలసదన్ భవన నిర్మాణ స్థల పరిశీలన



నెల్లూరు రూరల్: నగరంలోని నీలగిరి సంఘంలో గల తెలుగుగంగ ప్రాజెక్ట్ అతిథి గృహ ప్రాంగణంలో బాలసదన్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్ బుధవారం పరిశీలించారు. అన్ని విధాలా అనుకూలమైన సుమారు 50 సెంట్ల స్థలాన్ని బాలసదన్ నిర్మాణానికి కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సీఎస్సార్ నిధులతో భవనాన్ని నిర్మించనున్నారని తెలిపారు. నెల్లూరు రూరల్ తహసీల్దార్ సోమ్లానాయక్, సర్వేయర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 2 । నవంబర్ । 2023



సోమశిలలో 30.090 టీఎంసీలు

సోమశిల జలాశయంలో బుధవారం 30.090 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫైతట్టు ప్రాంతాల నుంచి 52 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,655
3శాతం జీఎస్టీతో	రూ.5,825
నవర (8గ్రా)	రూ.46,600

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /26.2

బుధవారం గాలిలో తేమ 78 శాతం ఉంది. గురువారం ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ కానుక పంపిణీ



నెల్లూరు రామాలయం వీధికి చెందిన పోలమ్మకు హాస్పిటల్‌లో పింఛను నగదు అందజేస్తున్న వలంటీర్ నాగరాజు

నెల్లూరు (పొగతోట): జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజు బుధవారం 67.12 శాతం మంది లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ చేశారు. 3,16,617 మంది లబ్ధిదారులకు కానుక నగదు అందచేయాల్సి ఉండగా 2,12,520 మంది లబ్ధిదారులకు అందచేశారు. వలంటీర్లు ఉదయం నుంచే నగదు పంపిణీ ప్రారంభించారు. అవ్వాతాతల తలుపులు తట్టి వైఎస్సార్ కానుక నగదును అందచేశారు. ఈనెల 5వ తేదీ వరకు పింఛను నగదు పంపిణీ చేయనున్నారు.

ఢిల్లీ చేరిన అమృత్ కలశ యాత్ర



ఢిల్లీలో బృంద సభ్యులు

నెల్లూరు (పొగతోట): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ కలశ యాత్ర (మేరీ మాటీ మేరా దేశ్) ఢిల్లీకి చేరింది. జిల్లాలోని 722 పంచాయతీల నుంచి కొంతమందిని ఎంపిక చేసి నెహ్రూ యువజన కేంద్రం ద్వారా ఢిల్లీకి పంపించారు. 50 మంది సభ్యుల బృందం గత నెల 27న మట్టి కలశాలతో ఢిల్లీకి బయలుదేరింది. ఢిల్లీలో కర్తవ్యపథ్‌కు అమృత కలశ్ యాత్ర చేరింది. బృందం ఢిల్లీలో కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి నెల్లూరుకు బయలుదేరింది.

శిశు మరణాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు సిటీ: జిల్లాలో శిశు మరణాల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం శిశు మరణాలపై సబ్‌కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టులో 10, సెప్టెంబర్‌లో 8 శిశు మరణాలు జరిగాయన్నారు. శిశు మరణాల నివారణకు గర్భవతుల్లో రక్తహీనత నివారణ, తల్లిపాలు పిల్లలకు పట్టించడంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ శైలీనాకుమారి, డాక్టర్ మంజుల, శ్రీనివాసరావు, సహన పాల్గొన్నారు.

ప్రేమాయణం ఒకరితో పెళ్లి మరొకరితో

- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

కావలి: ఒక యువతితో ప్రేమ నటించాడు. తనకు సర్వస్వం నువ్వే అని నమ్మించాడు. శారీరక వాంఛలూ తీర్చుకున్నాడు. చివరకు ఆమెకు తెలియకుండా మరో యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో మోసపోయిన బాధితురాలు యువకుడిపై కావలి టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కావలి టుటౌన్ సీఐ సుధాకర్ కథనం ప్రకారం.. కావలి పట్టణంలోని వెంగళరావునగర్‌కు చెందిన మునగాల విష్ణువర్ధన్‌రెడ్డి డిగ్రీ చదువుతున్న యువతితో ప్రేమనటించి అవసరాలు తీర్చుకున్నాడు. ఇటీవల మరో యువతిని పెళ్లి చేసుకోవడంతో బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డిపై అత్యాచారం, ఎస్సీ అట్రాసిటీ, ఛీటింగ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

కండలేరులో 11.381 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.381 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి

- ఆయన ప్రాణత్యాగ ఫలితమే తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం
- పొట్టి శ్రీరాములుకు నేతల నివాళి
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ. వేదికపై మేయర్ స్రవంతి తదితరులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్



స్వాతంత్య్ర సమరయోధుడు కేవీ చలమయ్యను సత్కరిస్తున్న దృశ్యం

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి కృషి చేసి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని, ప్రజల మనస్సులో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బ కళాక్షేత్రంలో బుధవారం ఉదయం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ హరినారాయణన్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ఆర్డీఓ మలోలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితంగా 1953లో ప్రత్యేక తెలుగురాష్ట్రం ఏర్పాటు అయిందన్నారు. పొట్టి శ్రీరాములు మన అందరి హృదయాల్లో అమరజీవి అయ్యారని అన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జిల్లావాసి కావడం మనకెంతో గర్వకారణమని, పొట్టి శ్రీరాములు జన్మించిన ఈ జిల్లాలో కలెక్టర్‌గా పనిచేయటానికి అవకాశం కలగడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 1వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా జరుపుకోవడంతో పాటు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవడం జరుగుతుందన్నారు. స్వాతంత్య్ర సమరంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులందరినీ మనం గుర్తు చేసుకొంటూ వారి అడుగుజాడల్లో ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ తెలుగు వారంతా ఒకే రాష్ట్రంలో జీవించాలన్న లక్ష్యంతో ఆంధ్రరాష్ట్ర సాధన కోసం నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించి అమరజీవి అయిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని, వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శాసనమండలి మాజీ సభ్యుడు మాదాసు గంగాధరం మాట్లాడుతూ ప్రాణాలు అర్పించి ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్య్ర సమరయోధులు కేవీ చలమయ్య మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని మహాత్మా గాంధీ మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి అన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన మహనీయులని, వారి జీవిత చరిత్రను వివరిస్తూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధుడు కేవీ చలమయ్యను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, హేనా సుజన, డీఈఓ గంగాభవాని, డీటీసీ చందర్, ఐటీడీఏ పీఓ మందారాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుధాకర్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారు లు, విద్యార్థిని విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- వీఎస్‌యూలో తీరనున్న ఏళ్లనాటి సమస్య
- విక్రమ సింహపురిలో భర్తీకానున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది



విక్రమ సింహపురి యూనివర్సిటీ

వీఎస్‌యూ కళాశాలలో విద్యార్థుల సంఖ్య:	ప్రస్తుతం అధ్యాపక, అధ్యాపకేతరులు
1200	300
కొత్తగా భర్తీ కానున్న పోస్టులు (రెగ్యులర్, బ్యాక్‌లాగ్): 106	

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు పొందిన ఆనందంలో ఉన్న వీఎస్‌యూ బృందానికి ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం మరో తీపి కబురులాంటింది. టీడీపీ ప్రభుత్వంలో ఒక్క పోస్టును కూడా భర్తీ చేయపోవడం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖాళీల మొత్తం భర్తీకి ముందుకు రావడంతో అధ్యాపకులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)ని నెల్లూరులో ఏర్పాటు చేశారు. తొలుత నెల్లూరు నగరంలో ప్రారంభం కాగా, సొంత భవనాల్లో వీఎస్‌యూ నిర్మాణానికి వెంకటాచలం మండలం కాకుటూరులో 83 ఎకరాలు కేటాయించారు. దివంగత నేత వైఎస్సార్ మరణానంతరం అప్పటి ప్రభుత్వాలు వీఎస్‌యూ గురించి పట్టించుకోక పోవడంతో అరకొర వసతులతో 2017లో కాకుటూరులోని సొంత భవనాల్లోకి మార్చారు. వీఎస్‌యూ అభివృద్ధిని విస్మరించిన పాలకులు, వీఎస్‌యూలో పోస్టుల భర్తీ గురించి కూడా పట్టించుకోలేదు. దీంతో ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో నెట్టుకొస్తూ వచ్చారు. ప్రస్తుతం వీఎస్‌యూలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మొత్తం కలిపి 300 మంది ఉండగా, 1200 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేయాలని గత ప్రభుత్వం హయాంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అనేక దఫాలు వీఎస్‌యూ వద్ద ఆందోళనలు చేపట్టినా పట్టించుకోలేదు.

తీరనున్న అధ్యాపకుల కొరత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఎస్‌యూ రూపురేఖలు మారిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేయడంతో పాటు కొత్త భవనాలు నిర్మించేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. ఫలితంగా ఇటీవల న్యాక్ బృందం వీఎస్‌యూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంతో వీఎస్‌యూలో అధ్యాపకుల కొరత పూర్తిగా తీరనుంది. వీఎస్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులు కొత్తగా రెగ్యులర్, బ్యాగ్‌లాగ్ కలిపి 106 ఖాళీలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పోస్టుల భర్తీతో వీఎస్‌యూలో అధ్యాపక, అధ్యాకేతర సిబ్బంది సమస్య పూర్తిగా తీరిపోతుందని అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీలు మొత్తం భర్తీ



విక్రమ సింహపురి యూనివర్సిటీలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమస్య చాలా ఏళ్ల నుంచి ఉంది. వర్సిటీల్లో పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషకరం. పోస్టుల భర్తీతో వీఎస్‌యూలో పూర్తిస్థాయిలో అధ్యాపక, అధ్యాపకేత సిబ్బంది రానున్నారు.

– పి.రామచంద్రారెడ్డి, రిజిస్ట్రార్

ప్రతి మనస్సును వెంటాడే జ్ఞాపకం

- మేకపాటి గౌతమ్‌రెడ్డి
- నేడు ఆయన జయంతి



దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్: పద్ధతైన రాజకీయ కుటుంబ నేపథ్యం. విజయవంతమైన వ్యాపారవేత్త. మంత్రి కావడంతో ప్రజల్లో మరింత మంచి పేరు. ఆయనే మేకపాటి గౌతమ్‌రెడ్డి. ఆయన మరణించి 20 నెలలు కాలం గడిచింది. కాని అందరి మదిలో శాశ్వతంగా నిలిచిపోయారు. తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి రాజకీయ వారసునిగా అడుగుపెట్టిన గౌతమ్‌రెడ్డి 2014 ఆత్మకూరు నియోజకవర్గం తరపున తొలిసారిగా శాసనసభ్యునిగా బరిలో దిగారు. ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించిన అనంతరం పూర్తిగా ప్రజాక్షేత్రంలోనే నడిచారు. ఆత్మకూరు నియోజకవర్గం గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలన్న సంకల్పంతో నియోజకవర్గంలో 50 రోజుల పాటు పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి 30,191 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రతిపక్ష పార్టీ శాసనసభ్యునిగా ఉన్న సమయంలో ఆయన తన సొంత నిధులతోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరులోని మెట్ట ప్రాంత రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న సమయంలో సొంత నిధులతో జేసీబీని ఏర్పాటు చేసి సుమారు 75 రోజుల పాటు రైతుల పొలాలకు సాగునీరు అందించి వారి మన్ననలను చూరగొన్నారు. మరికొందరు రైతుల పొలాల్లో ఆయన బోర్లు కూడా వేయించారు. మెట్ట ప్రాంత రైతాంగానికి డెల్టాతో సమానంగా నీరు అందించాలని ఎన్నో సమావేశాల్లో అధికారుల వద్ద మాట్లాడి సాధించిన వ్యక్తి మేకపాటి అని నియోజకవర్గ రైతాంగం ఇప్పటికీ గుర్తు చేసుకుంటుంది. 2019 ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికల్లో నిలిచి రెండోసారి ఆత్మకూరు ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొంది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా గౌతమ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కరోనా సమయంలో మంత్రి మేకపాటి అందించిన సేవలు ప్రజలెవ్వరూ మరచిపోలేరు. ఆత్మకూరు నియోజకవర్గంలో కరోనాకు సంబంధించిన సొంత నిధులతో శానిటైజర్లు, మాస్కులు, ఆక్సిజన్ సిలెండర్లు కూడా సమకూర్చి కరోనా పెను ప్రమాదం నుండి ప్రజలను కాపాడుకున్నారు. మెట్ట నియోజకవర్గాన్ని పారిశ్రామికంగానూ అభివృద్ధి చేయవచ్చునని తలంచిన ఆయన ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసి కంపెనీల ఏర్పాటుకు కృషి చేశారు. నవంబర్ 2న మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని కుటుంబసభ్యులు భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని ఆయనకు నివాళులు అర్పించేందుకు సిద్ధమవుతున్నారు.

డీపీఓగా సుస్మితారెడ్డి



డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు (పొగతోట): జిల్లా పంచాయతీ అధికారిగా (ఇన్‌చార్జ్)గా విధులు నిర్వహిస్తున్న సుస్మితారెడ్డికి గత నెలలో డీఎల్‌డీఓగా పదోన్నతి లభించింది. ఇన్‌చార్జ్ డీపీఓగా పనిచేస్తున్న ఆమెకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీపీఓగా ఆమె బాధ్యతలు స్వీకరించారు.

న్యాయవాదుల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

- వారి క్షేమం గురించి ఆలోచించేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే
- వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ సదస్సులో మంత్రి కాకాణి





వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ వేమిరెడ్డి తదితరులు. సదస్సుకు హాజరైన న్యాయవాదులు

నెల్లూరు(బారకాసు): అన్ని వృత్తుల్లో కెల్లా న్యాయవాద వృత్తి భిన్నమైందని.. అటువంటి న్యాయవాదుల సంక్షేమం గురించి ఆలోచించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అనిల్‌గార్డెన్‌లో పార్టీ లీగల్‌సెల్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కాకాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కోర్టుకు సంబంధించిన కేసుల్లో పేదలకు న్యాయం జరిగేందుకు ఆలోచించే న్యాయవాదులపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఇప్పటి వరకు అనేక మంది ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారని అయితే ఎవరూ కూడా చెప్పిన హామీలు నెరవేర్చలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎన్నికల్లో చెప్పినవని, చెప్పనివి కూడా నెరవేర్చారని చెప్పారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.వంద కోట్లు కేటాయించి.. ఇప్పటికే రూ.25 కోట్లు విడుదల చేశారన్నారు. మిగిలిన నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి దృష్టికి తాను, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇద్దరం తీసుకెళ్తామన్నారు. లా నేస్తం పథకం ద్వారా ప్రతి నెలా జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్‌గా రూ.5వేలు ఇవ్వడం జరుగుతోందని, మృతిచెందిన న్యాయవాది కుటుంబానికి మ్యాచింగ్ గ్రాంట్ ద్వారా రూ.4 లక్షలు అందించడం వంటి కార్యక్రమాలు దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి తప్ప ఏ ముఖ్యమంత్రీ చేయడం లేదన్నారు. జిల్లాలో అనేక మంది న్యాయవాదులున్నారని అయితే కోట్లు ఖర్చు చేసి బయట నుంచి న్యాయవాదులను పిలిపించుకుని తమ కేసులను వాదించుకోవడం కన్నా సిగ్గుచేటు మరొకటి లేదని చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విలువలు కలిగిన న్యాయవాదులందరూ వైఎస్సార్‌సీపీలో ఉండటం సంతోషకరమన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్‌లో మంచి టీం ఉందని వీరంతా ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారని కొనియాడారు. పట్టణాల్లో ఓటింగ్ శాతం తగ్గిపోతోందని.. దాన్ని పెంచేందుకు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. 2024 ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా పోటీ చేయబోతున్నానని, న్యాయవాదులందరూ సహకరించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ న్యాయవాదుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనవంతు కృషి చేస్తున్నారని చెప్పారు. కాబట్టి 2024లో తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టేందుకు న్యాయవాదులందరూ సమన్వయంతో తమ వంతు కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న నాలుగైదు నెలలు కీలకమని, ఇప్పటి నుంచే తామంతా కష్టపడి పనిచేసి 2024లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు అనేక కుంభకోణాలకు, అవినీతికి పాల్పడి పీకల్లోతు కూరుకుపోయారని చెప్పారు. బార్ కౌన్సిల్లో ఏకపక్ష నిర్ణయాల వలన న్యాయవాదుల్లో గందరగోళం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని తమ న్యాయవాదుల ముందు ఉన్న ఒక్కటే లక్ష్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవడమేనని అందుకు తామంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం దివంతత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఢిల్లీ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌తో పాటు జిల్లాలోని న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పతకాలు

- జిల్లాలో పలువురి ఎంపిక
- గణతంత్ర వేడుకల్లో బహూకరణ



సేవాపతకానికి ఎంపికైన గునసాని శ్రీహరి, ఎం.సుబ్రమణ్యం

నెల్లూరు(క్రైమ్): ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, అగ్నిమాపక, విజిలెన్స్ విభాగాల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన అధికారులు, సిబ్బందికి సేవా పతకాలను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్ నెంబర్ 182ను బుధవారం విడుదల చేసింది. జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఉత్తమ సేవా పతకం, సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరందరికి వచ్చే ఏడాది జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పతకాలు బహూకరించనున్నారు.

ఉత్తమ సేవాపతకం (పోలీసు)

మాచిరాజు సుబ్బరాజు, ఏఆర్ఎస్ఐ డీఏఆర్

సేవాపతకం

లెల్లబోయిన రామకోటేశ్వరరావు, ఎస్ఐ, ఎస్‌బి
మహ్మద్ రియాజ్, ఏఆర్ఎస్ఐ, డీఏఆర్
మన్నేపల్లి సుబ్రమణ్యం, ఏఎస్ఐ, ఎస్‌బి
గునసాని శ్రీహరి, ఏఎస్ఐ, చిన్నబజార్
బొల్లెద్దుల శ్రీనివాసులు, హెచ్‌సి, ఇందుకూరుపేట
సూరి ఉదయకిరణ్, పీసీ చిన్నబజార్

సేవాపతకం (అగ్నిమాపకశాఖ)

ఎల్.మస్తాన్‌రావు, లీడింగ్ ఫైర్‌మెన్, నెల్లూరు
టి.సుబ్బరాజు, లీడింగ్ ఫైర్‌మెన్, కందుకూరు
డి.ప్రసాద్, డ్రైవర్ ఆపరేటర్, పొదలకూరు

సేవాపతకం (విజిలెన్స్)

సీహెచ్ శివకృష్ణ, కానిస్టేబుల్, నెల్లూరు

పోరాటమే ఆమె జెండా

సుధా భరద్వాజ్ అలుపెరుగని ప్రయాణం

అమెరికాలో పుట్టి పెరిగింది సుధా భరద్వాజ్ అమ్మతో పాటు స్వదేశానికి వచ్చి కాన్పూర్ ఐఐటీలో చదువు పూర్తి చేసింది. కార్మికులు, గిరిజన మహిళల వెతలు తెలుసుకొని అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకుని న్యాయవాద వృత్తిని చేపట్టింది. మహిళా ఖైదీల సమస్యలపై పోరాడింది. సాధారణ జీవనం నుంచి సామాజిక కార్యకర్తగా బలహీనులకు న్యాయం చేయడానికి సమస్యలపై పోరాడుతూనే ఉంది. సుధా భరద్వాజ్ జీవితం తెలుసుకుంటే స్త్రీ శక్తి మరో కోణంలో పరిచయం అవకుండా ఉండదు. ఈ విషయాలను ఆమె ప్రస్తావిస్తూ...



సుధా భరద్వాజ్

అరవై ఏళ్ల క్రితం నవంబర్ 1న అమెరికాలో పుట్టాను. అమ్మానాన్నలు ఇద్దరూ పేరొందిన ఆర్థిక వేత్తలు. సామాజికంగానూ చాలా చురుకుగా ఉండేవారు. నేను పుట్టిన ఏడాదికి వారిద్దరూ భారతదేశం వచ్చారు. నాకు నాలుగేళ్ల వయసులో అమ్మానాన్నలు విడిపోయారు. అమ్మ ఒంటరిగా ఉంటూ నన్ను పెంచి, పెద్దచేసింది. అమ్మకు కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ఫెలోషిప్ రావడంతో విదేశాలకు వెళ్లిపోయాం. ఆ తర్వాత కొన్నేళ్లకు రాజస్థాన్‌లోని జెఎన్‌యూలో టీచింగ్ చేయడానికి అమ్మ స్వదేశానికి వచ్చింది. అలా అమ్మతోపాటు నేనూ వచ్చేశాను. 'సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్'ని స్థాపించడంలో ఆమె ముఖ్యమైన పాత్ర పోషించింది. గొప్ప గొప్ప ఆర్థిక వేత్తలతో కలిసి భారత ఆర్థిక వ్యవస్థపై లోతయిన అధ్యయనాలు చేసింది. జేఎన్‌యులో చదువుతో పాటు సామాజిక రాజకీయ అంశాలపై కూడా విద్యార్థులు చురుకుగా ఉండేవారు. నేను అలాంటి వాతావరణంలో పెరిగాను. సాహిత్య, సామాజిక కార్యక్రమాలంటే ఇష్టంగా ఉండేది. గణితంలో కూడా మంచి ఆసక్తి ఉండటంతో ఐఐటీ కాన్పూర్‌లో అడ్మిషన్ తీసుకున్నాను.

■ చదువుతూ కూలీలతో..

ఐఐటీలో కొంతమంది విద్యార్థులతో ఒక చిన్న రీసెర్చ్ టీమ్ ఏర్పడింది. కోర్సుతో పాటు పబ్లిక్ సెక్టార్, సైన్స్ అండ్ టెక్నాలజీ వరకు చదివేవాళ్లం. సామాజిక సమస్యలనూ చర్చించేవాళ్లం. అప్పుడే ప్రజా సంక్షేమానికి కృషి చేస్తేనే నా చదువుకు సార్థకత అనుకునేదానిని. కొంతమంది తోటివిద్యార్థులతో కలిసి కూలీల మధ్య పని చేయడం ప్రారంభించాం. ఓసారి ఉన్నావ్‌లోని ఓ ఫ్యాక్టరీలో కార్మికులపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటన చోటుచేసుకుంది. మా టీమ్‌తో కలిసి నిజనిర్ధారణ కోసం వెళ్లాం. కష్టపడి పనిచేసే వారితో అనుబంధం అలా మొదలైంది. అక్కడ కార్మికులతో కలిసి వారి పాటలు, సంగీతం ఆస్వాదించేదాన్ని. కాన్పూరియా యాసలో మాట్లాడటం, పాడడం అంటే చాలా ఇష్టం ఉండేది. ఆ విధంగా కార్మికుల ఉద్యమంతో చాలా ప్రభావితమయ్యాను. 1982లో ఆసియా క్రీడలు జరగడానికి ముందు ఢిల్లీలో ఫ్లై ఓవర్లు, స్టేడియం నిర్మిస్తున్నారు. ఈ పనులకోసం ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లోని మారుమూల ప్రాంతాల నుంచి పేద కూలీలను రప్పించి, వారిని శిబిరాల్లో ఉంచారు. అయితే, వారు తమ ఇంటికి వెళ్ళడానికి టికెట్లు కూడా కొనలేని విధంగా చాలా తక్కువ కూలీ ఇచ్చేవారు. నాకెందుకో వారిని క్యాంపులో బంధించినట్లు అనిపించింది. ఆ తర్వాత 1984లో సిక్కుల ఊచకోత, భోపాల్ గ్యాస్ విషాదం దిగ్భ్రాంతికి గురిచేశాయి. సమాజంలో మార్పు తీసుకు రావాలనే సంకల్పం అప్పుడే నా మనసులో బలంగా మారింది.

■ నా దేశం కోసం అమెరికా పౌరసత్వం వదులుకున్నా

నాకు 21 ఏళ్లు వచ్చినప్పుడు, నేను పుట్టుకతో పొందిన అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకోవాలని అమ్మతో కలిసి అమెరికన్ ఎంబసీకి వెళ్లాను. నేను పౌరసత్వాన్ని వదులుకుంటున్నానని చెబితే ఆశ్చర్యపోయారు. అందుకు తగిన ఫారమ్ కోసం వెతికితే, దొరకలేదు. 'వారం తర్వాత రండి. ఈ నిర్ణయం తీసుకునేముందు మీ ఇంట్లో ఎవరినైనా అడిగారా...?' వంటి ప్రశ్నలు వేశారు. అంటే ఇంట్లో మగవారికి తెలియకుండా అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకోవడానికి వచ్చామని వారు అనుకున్నారు. యుఎస్ పౌరసత్వాన్ని వదులుకున్న తర్వాత, హోం మంత్రిత్వ శాఖలో భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేశాను.



■ కార్మిక ఉద్యమాల్లో భాగంగా..

మరోవైపు దేశంలో అలజడి కొనసాగుతోంది. మిల్లు కార్మికుల ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఈ ఉద్యమాల్లోనే అద్భుతమైన కార్మిక నాయకుడు శంకర్ గుహ నియోగి పేరు మొదటి సారిగా తెలిసింది. 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా' ద్వారా కార్మికుల ఆర్థిక అవసరాలను పెంచడంతోపాటు, వారికోసం పాఠశాలలు, ఆసుపత్రులను నడుపుతూ వారి మధ్య ఉంటూ వ్యసనాల నుండి బయటపడటానికి సహాయం చేస్తున్నాడు. జాతీయ భద్రతాచట్టం కింద అతణ్ణి అరెస్టు చేసినప్పుడు, అతని విడుదల కోసం విద్యార్థులుగా మేం పోరాడాం. విడుదలైన తర్వాత ఆయనను కలిశాం. 1986 నాటికి, నేను 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా'తో పనిచేయాలని నిర్ణయించుకున్నాను. భిలాయ్ సమీపంలోని రాజహారా గనులలో పని చేసే పిల్లలకు చదువు నేర్పించడం ప్రారంభించాను. కొంతకాలం తర్వాత, భిలాయ్‌లో కార్మిక చట్టాలను అమలు చేయడానికి భీకర పోరాటం ప్రారంభమైంది. 16 పెద్ద కంపెనీలు 4,200 మంది కార్మికులను తొలగించాయి. కార్మికులను తిరిగి పనిలో చేర్చడానికి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు జరిగాయి. కొంతమంది కార్మికులు చనిపోయారు. వారి కుటుంబాలతో కలిసి ఎండ వానలు లెక్కచేయకుండా గడిపాం.

■ న్యాయం కోసం పోరాటం ...

కార్మికుల అభ్యర్థన మేరకు, నేను 2000 సంవత్సరంలో నా న్యాయవిద్యను పూర్తి చేసి వారి కోసం న్యాయపోరాటం ప్రారంభించాను. కూలీలు, గిరిజనులు, మహిళలు అనే తేడా లేకుండా వారి కోసం చేసిన చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడం చూశాను. నిరసన తెలిపితే వారిపై కేసులు పెడతారు. ఆ తర్వాత కొంత మంది తోటి లాయర్లతో కలిసి జన్-హిత్ పేరుతో గ్రూప్‌ని ప్రారంభించాను. ఆ తర్వాత భూసేకరణ, అటవీ హక్కులు, పర్యావరణ సంబంధిత సమస్యలకు సంబంధించిన అనేక కేసులను వాదించడం ప్రారంభించాం. కేసులన్నీ కార్పొరేట్ల పైనే ఉన్నాయి. అప్పటికి చాలామంది శత్రువులను కూడగట్టుకున్నానని గ్రహించాను. కానీ, ఏ మాత్రం భయపడకుండా బలహీనుల కోసం నా గొంతు పెంచుతూనే ఉన్నాను.

■ ఆశ సన్నగిల్లిన సందర్భాలు..

2006లో దంతెవాడలో ఐదుగురు మహిళలపై సామూహిక అత్యాచారం జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆ మహిళల కేసుపై పోరాడేందుకు న్యాయవాది ఎవరూ సిద్ధంగా లేరు, నేను నా సహోద్యోగులతో కలిసి వారికి న్యాయం చేసే బాధ్యతను తీసుకున్నాను. బాధితుల వాంగ్మూలం నమోదు చేసేందుకు దంతెవాడకు 150 కి.మీ దూరంలోని కొంటకు వెళ్లాల్సి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ భాషలో, కొంట అంటే మూల అని అర్థం, ఆ ప్రదేశం నిజానికి ఛత్తీస్‌గఢ్‌లోని ఒక మూల. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ప్రారంభమవుతుంది. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫ్యూన్ సైకిల్‌పై ఎక్కి వస్తారంటే అక్కడి పరిస్థితిని అంచనా వేయవచ్చు. బాధితులు గోండీ భాషలో తమ బాధలను వివరిస్తుంటే అక్కడ ఉన్న ఫ్యూన్ అనువాదకుడిగా మారాడు. అప్పుడే అత్యాచారం కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేసు దంతెవాడకు బదిలీ అయింది. ఆ తర్వాత మహిళలపై ఒత్తిడి తెచ్చి కేసులు ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకునేలా చేశారు. అప్పుడు న్యాయంపై ఆశ చచ్చిపోయిందని పించింది.

■ గర్భస్రావం తర్వాత దత్తత కుమార్తె

రాజహారలో ఉన్నప్పుడు 8 నెలల గర్భిణిని. ఆ రోజు చాలా వర్షం, మెరుపులు, కడుపు నొప్పితో బాధపడుతున్నాను. మా యూనియన్ చెందిన షాహీద్ హాస్పిటల్ కి నడుచుకుంటూ వెళుతుండగా రక్తం కారుతున్నట్లు అనిపించింది. ఎలాగోలా ఆసుపత్రికి చేరుకుని అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆపరేషన్ అయింది. స్పృహ వచ్చాక గర్భస్రావం అయిందని తెలిసింది. ఈ ప్రమాదం జరిగిన తర్వాత, మళ్లీ గర్భం ప్రమాదకరమనుకున్నాను. అందుకే ఒకమ్మాయిని దత్తత తీసుకున్నాను. కూతురు డిగ్రీ చదువు కోసం డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఢిల్లీకి వచ్చి 58 ఏళ్ల వయసులో నేషనల్ లా యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా తొలిసారి రెగ్యులర్ ఉద్యోగంలో చేరాను. ఏడాది సాఫీగానే గడిచింది. కానీ, ఉద్యమకారిణిగా నన్ను అరెస్టు చేసి జైలుకు పంపారు. చాలా పోరాటం తర్వాత తను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. జైలులో ఉన్నప్పుడు కూతురిని కలవాలని చాలా తపించేదాన్ని. నెలకు ఒకసారి ఉత్తరానికి సమాధానం వచ్చేది. కలవడానికి వీలయ్యేది కాదు. జైలులో ఉన్న మూడేళ్లు మహిళా ఖైదీల సమస్యలను వింటూ, వారి కోసం వర్క్ చేశాను. సామాజిక కార్యకర్తలకు వ్యక్తిగత జీవితం లేదన్నది నిజం. వారు ఇంటికీ, సామాజిక జీవితానికీ మధ్య సమన్వయం చేసుకోలేరు. దీపం కింద చీకటి అనే సామెత నిజం అవుతుంది. ముఖ్యంగా మహిళా సామాజిక కార్యకర్తలు మరిన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. నా జైలు డైరీ 'ఫ్రమ్ ఫాన్సీ యార్డ్'లో నేను అలాంటి చాలామంది మహిళల కథలను పంచుకున్నాను. సమాజంలోని ఈ దురాచారాలకు వ్యతిరేకంగా నేను ఎప్పుడూ పోరాడుతూనే ఉన్నాను'' అని వివరిస్తారు ఈ సామాజిక కార్యకర్త.

బ్యూటిప్స్



రెండు టీస్పూన్ల కొబ్బరి నూనెలో టీ స్పూను పసుపు, టేబుల్ స్పూను పెరుగు, టేబుల్ స్పూను శనగపిండి, రెండు టీస్పూన్ల టొమాటో రసం, రెండు టీస్పూన్ల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు రాసి ఐదుని మిషాలు రుద్దాలి. తరువాత నీటితో కడిగితే ట్యాన్ మొత్తం పోతుంది.

స్ట్రెయిట్‌గా... సిల్కీగా...



గ్లాసు నీటిలో రెండు టీస్పూన్ల అవిసె గింజలు, రెండు టీస్పూన్ల బియ్యప్పిండి వేసి పదిని మిషాలు మరిగించాలి. తరువాత వడగట్టి...పేస్టులాంటి పదార్థాన్ని తీసుకోవాలి. దీనిలో టేబుల్ స్పూను కొబ్బరి నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి చివర్లవరకు పట్టించాలి. గంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ జుట్టుని స్ట్రెయిట్‌గా, సిల్కీగా మారుస్తుంది.

కిచెన్‌టిప్స్

మిరియాలు, ముద్దకర్పూరాలను సమపాళ్లలో తీసుకుని పొడిచేయాలి. ఈ మిశ్రమంలో కొద్దిగా టూత్‌పేస్టు, కొద్దిగా ఫేస్‌పౌడర్ వేసి కలపాలి. చివరిగా నాలుగు వెల్లుల్లి గర్భాలను మెత్తగా నూరి అందులో కలపాలి. ఈ మిశ్రమాన్ని బొద్దింకలు తిరిగే ప్రాంతాల్లో రాస్తే బొద్దింకలు లోపలికి రావు. చూద్దామన్నా ఇంట్లో ఎక్కడా కనిపించవు.





వంటింట్లో వాడే టవల్స్, మసిబట్టలు జిడ్డుపట్టి ఒక పట్టాన వదలవు. వీటిని ఉతకడానికి పెద్దగా శ్రమపడనక్కర్లేదు. వేడినీటిలో కాస్తంత షాంపు కలపాలి. ఈ నీటిలో జిడ్డుపట్టిన టవల్‌ను నానబెట్టాలి. 20 నిమిషాల తరువాత బ్రష్‌తో రుద్దుతూ ఉతికితే జిడ్డు, దుర్వాసన పోయి టవల్ శుభ్రంగా మారుతుంది. వారానికి ఒకసారి కిచెన్ టవల్స్‌ను ఇలా ఉతికితే జిడ్డుగా అనిపించవు.

విశేషం

ఆనాటి మహానగరాలు మన చెంతకు వచ్చేలా..

మన పార్వతీశం... అదేనండీ బారిష్టర్ పార్వతీశం మొగల్తూరు నుంచి ఇంగ్లాండ్‌కు వెళతాడు.

ఆ కాలంలో మొగల్తూరు ఎలా ఉండేదో?

మహీధర సాహిత్యంలో ముంగండ అగ్రహారం నిండుగా కనిపిస్తుంది. అప్పటి అగ్రహారం జనాభా ఎంత? ఆచార, వ్యవహారాలు ఏమిటి?

మన తెలుగు సాహిత్యం అనే కాదు భారతీయ సాహిత్యంలో ఎన్నో పట్టణాలు, ఊళ్లు కనిపిస్తాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కోణంలో వాటి గురించి


అపూర్వ సైనీ, దివ్య రవీంద్రనాథ్

దేటా బేస్ తయారు చేస్తే ఎలా ఉంటుంది?

'బ్రహ్మాండంగా ఉంటుంది' అనే భావనతో 'ది సిటీస్ ఇన్ ఫిక్షన్' అనే ప్రాజెక్ట్‌ను చేపట్టారు దివ్య రవీంద్రనాథ్, అపూర్వ సైనీ...

ప్రయాణాలలో సాహిత్య ప్రయాణాలు వేరు. వీసాలతో పని లేకుండా ప్రపంచంలోని ఏ నగరానికైనా రెక్కలు కట్టుకొని ఎగిరిపోవచ్చు. భారతీయ సాహిత్యంలో కాల్పనిక నగరాలతో పాటు వాస్తవిక నగరాలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యం అనే రెక్కలతో ఎన్నో కథల్లో ఎన్నో నగరాలకు ఎగురుకుంటూ వెళ్లిపోవచ్చు.

ఒక పుస్తకంలో ఒక నగరం ఒకే కోణంలో కనిపించవచ్చు. అలాంటి నగరాల గురించి అన్ని కోణాలలో దర్శించగలిగే సమాచార నిధిని నిర్మించడానికి నడుం కట్టారు దివ్య రవీంద్రనాథ్, అపూర్వ సైనీ.

రచయితలు, పాఠకులు, పరిశోధకులు, విద్యావేత్తలకు ఉపకరించే సమాచారం 'ది సిటీస్ ఇన్ ఫిక్షన్' లో ఉంటుంది.

దక్షిణ ఆసియా కేంద్రంగా ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. దీనిలో భాగంగా మొదట మన దేశాన్ని ఎంచుకున్నారు.

పుస్తకంలో ఒక నగరాన్ని ఎలా వర్ణించారు అనేదానితో పాటు ఆ నగరానికి సంబంధించి అప్పటి జనాభా, అరుదైన జ్ఞాపకాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, అర్బన్ ప్లానింగ్, పర్యావరణం... ఇలా సవివరమైన సమాచారం ఉంటుంది.

ముఖ్యంగా ఈ తరం విద్యార్థులు ఆనాటి నగరాలను వివిధ కోణాలలో చూడవచ్చు.

'కాల్పనిక సాహిత్యం అంటే ఎంతో ఇష్టం. ఎన్నో పుస్తకాలు చదివాను. సాహిత్యంలో ఉండే నగరాలపై ఆసక్తి ఉండేది. అమృత మహలే రాసిన మిల్క్ టీత్‌లో హౌసింగ్ నుంచి రియల్ ఎస్టేట్ వరకు తొంభైల నాటి ముంబై కనిపిస్తుంది. ఇలా చెబుతూ పోతే నగరాల చుట్టూ అల్లుకున్న ఎంతో సాహిత్యం ఉంది' అంటున్న దివ్య రవీంద్రనాథ్ బెంగళూరులోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్'లో పరిశోధకురాలు.

'ఫలాన పుస్తకాలు మాత్రమే అని పరిమితి లేదు. అన్ని రకాల పుస్తకాలను మా ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నాం. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎన్నో లైబ్రరీలు, బుక్‌స్టోర్స్‌కు వెళ్లాను. అదొక మహాసముద్రం అనిపించింది' అంటున్న అపూర్వ సైనీ దిల్లి యూనివర్శిటీలో చదువుకుంది. ఆమె రైటర్, ఎడిటర్, ట్రాన్స్‌లేటర్.

ప్రాజెక్ట్ మొదలు కాగానే దక్షిణ ఆసియా నలుమూలల నుంచి సలహాలు, సూచనలు వస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ ఆర్కైవ్ ప్రాజెక్ట్‌కు ఎవరైనా తమ వంతు సహకారం అందించవచ్చు.

డీజేవాలీ దీదీ



డిస్కోనైట్ అయినా, పెళ్లి బరాత్, దావత్ ఏదైనా డీజే మోత మోగి పోవాల్సిందే. నచ్చిన పాటను అడిగి మరీ పెట్టించుకుని స్టెప్పులతో ఊగిపోతుంది నేటి యువతరం. వెరైటీగా మిరుమిట్లు గొలిపే డ్రెస్ వేసుకుని, ఉత్సాహం నింపే పాటలను పెడుతూ ఊగిపోతుంటాడు డీజే. అబ్బాయిలు మాత్రమే డీజేగా కనిపిస్తుంటారు. కానీ డీజేవాలి దీది పురుషులకు ఏ మాత్రం తగ్గకుండా డీజేను దంచి కొడుతోంది. తన రీమిక్స్ బీట్స్‌తో మ్యూజిక్ లవర్స్‌ను ఉర్రూతలూగిస్తూ, సరికొత్త బాటలో నడిచేందుకు నేటి యువతరానికి మార్గం చూపుతోంది డీజే రింక్.

డీజే రింక్ మరెవరో కాదు 38 ఏళ్ల స్నేహల్ షా. గుజరాత్‌లో పుట్టినప్పటికీ ముంబైలో పెరిగింది. షాకు సంగీతం అంటే ఎంతో ఇష్టం. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తయ్యాక... కామర్స్‌లో పీజీ చేసింది. మార్కెటింగ్ కంపెనీలో చేరింది. ఉద్యోగం చేస్తున్నప్పటికీ స్నేహల్ మనసంతా సంగీతంపైనే ఉండేది. దీంతో.. మంచి మంచి పాటలను వినడం, వాటన్నింటినీ తన మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో భద్రపరుచుకోవడం అలవాటుగా మార్చుకుంది. ఇలా స్నేహల్ కలెక్ట్ చేసిన వాటిలో బాలీవుడ్ పాటలు కోకొల్లలు. సంగీతంపై ఉన్న మక్కువతో సౌండ్ ఇంజినీరింగ్ డిప్లొమా కూడా చేసింది.

డీజే రింక్‌గా...

ఒకసారి స్నేహల్ పార్టీకి వెళ్లింది. అక్కడ ఎంతో ఉత్సాహమైన డీజే పాటలు వస్తున్నాయి. తనకిష్టమైన పాటను ప్లేచేయమని డీజేను అడిగింది. అందుకు ఆ డీజే ప్లేచేయడం కుదరదు అన్నాడు. దీంతో తనే ప్లే చేసుకుంటాను అని అడిగి పాటను ప్లే చేసింది. అప్పటి నుంచి తను కూడా డీజేగా మారాలనుకుని.. ప్రముఖ డీజే జో అజిరెడో, డీజే సుకేతు దగ్గర డీజే శిక్షణ తీసుకుంది. నైపుణ్యాలన్నింటిని ఔపోసన పట్టాక 2015లో డీజే రింక్‌గా మారింది. వివిధ రకాల క్లబ్స్‌లో పని చేస్తూ 'డీజేయింగ్' సంబంధించిన అప్‌డేటెడ్ టెక్నాలజీ గురించి తెలుసుకునేది. స్నేహల్ ఇష్టాన్ని తల్లిదండ్రులు వెన్నంటే ఉండి ప్రోత్సహించేవారు. తల్లిదండ్రులు ముద్దుగా పిలుచుకునే 'రింకు' పేరునే ... డీజే రింక్‌గా మార్చుకుని డీజే ప్రపంచంలోకి అడుగుపెట్టింది.


స్నేహల్ షా

పదమూడులో పాపులర్...

డీజే రింక్ ఈడీఎమ్ ''ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్''లో కష్టపడి నైపుణ్యం సాధించింది. ముఖ్యంగా హిప్ హాప్, బాంగ్రా పాటలను ప్లేచేయడంలో అందె వేసిన చెయ్యిగా పేరుగాంచింది. పండుగల్లో రీమిక్స్ చేసిన పాటలను కూడా ప్లే చేసేది. అవి అందరినీ ఆకర్షిస్తుండడంతో డీజే రింక్ 2013లో బాగా పాపులర్ అయ్యింది. దీంతో భారతదేశంలో బాలీవుడ్ పాటలను మిక్స్ చేసే తొలి మహిళా డేజేగాను, ఇండియాలోని టాప్ -22 డీజేలలో ఒకటిగా నిలిచింది. పురుషుల ఆధిపత్యం కొనసాగే డిజే సౌండ్స్‌లో రింక్ ఏమాత్రం భయపడలేదు. ప్రారంభంలో పురుష డీజేలతో కలిసి పనిచేయడం కష్టం అయినప్పటికీ.. తనని తాను నిరూపించుకుని తన కలను నిజం చేసుకుంది.

అందర్నీ బీట్ చేస్తూ...

మంచి మంచి బీట్స్‌ను అందిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుతో పాటు అనేక రికార్డులను బద్దలు కొడుతోంది స్నేహల్ షా. మల్టీటాలెంటెడ్ సింగర్, రీమిక్సర్, పెర్‌ఫార్మర్‌గా అనేక ప్రశంసలు అందుకుంటోంది. సోనీ మ్యాక్స్ ఐపీఎల్ సీజన్ -6లో పాల్గొన్న ఒక్కగానొక్క మహిళా డీజే రింక్ కావడం విశేషం. గత పదేళ్లుగా ప్రపంచంలోని డీజేలతో పోటీ పడుతూ టాప్-100 జాబితాలో ఇండియా తరపున తనకంటూ స్థానం కల్పించుకుంది. 2023 సంవత్సరానికి గాను ఏషియా టాప్-50 డిజేల జాబితాలో ఐదో స్థానంలో నిలిచింది రింక్. అంతేగాక ఇటీవల 'బెస్ట్ వెడ్డింగ్ డీజే' అవార్డును అందుకుంది.

శ్రావ్యమైన బీట్స్‌తో సాగిపోతున్న డిజే రింక్ ఎంతోమంది మహిళలు, అమ్మాయిలకు ఆదర్శంగా నిలుస్తోంది. అనాదిగా వస్తోన్న పద్ధతులను దాటుకుని తమని తాము నిరూపించుకోవచ్చని తన బీట్స్‌తో చక్కగా వినిపిస్తోంది. ఇప్పటిదాక రెండు వేల బాలీవుడ్ పాటలను రీమిక్స్ చేసింది. డిజే స్కూల్ నడుపుతూ మరింతమంది డీజేలను తయారు చేస్తోంది. "డీజే రింక్స్ సౌండ్ ఫ్యాక్టరీ" పేరిట యూ ట్యూబ్ ఛానల్ నడుపుతోంది. అమృతారావ్, జాన్ అబ్రహమ్, కరణ్ గ్రోవర్, ఇలియానా డిక్రూజ్ వంటి బాలీవుడ్ సెలబ్రెటీలతో స్టేజ్ పంచుకుంది."ద వే యూ లైక్ మి" పేరిట రింక్ విడుదల చేసిన తొలి ఆల్బమ్‌కు మంచి ఆదరణ లభించి, బాగా పాపులర్ అయ్యింది.

క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో..



అమ్మవారిసేవలో రుూన్సీలక్ష్మి కుటుంబ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విజయవాడలోని సీఐడీ, డీజీపీ కార్యాలయంలో పనిచేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమసాని ఝాన్సీలక్ష్మి తన కుటుంబ సభ్యులతో జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. తీర్థ ప్రసాదాలు అందించి, శేషవస్త్రాలతో సత్కరించారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా చిన్ని భవానీప్రసాద్, సౌందర్య దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, కోశాధికారి మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

పొదలకూరు : మండలంలోని వరదాపురం గ్రామంలో ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమైనట్లు తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అల్లూర్తి గ్రామానికి చెందిన నందకిశోర్ వరదాపురం శ్రీసాయినాథ్ హైస్కూల్ హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాడు. ఏమైందో కానీ మంగళవారం సాయంత్రం నుంచి బాలుడు అదృశ్యం కావడంతో పాఠశాల యాజమాన్యంతో పాటు, తండ్రి కూడా గాలిస్తున్నారు. ఎంతకీ బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తండ్రి తెలిపారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే తన కుమారుడు తప్పిపోయాడని తండ్రి ఆరోపిస్తున్నాడు. అయితే బాలుడికి హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టం లేదని, అదే విషయాన్ని తాము వెల్లడించామని, టీసీ కూడా తీసుకు వెళ్లాల్సిందిగా సూచించినట్లు యజమాన్యం వారు చెప్పారు. తాము కూడా చుట్టుపక్కల గ్రామాల్లో గాలిస్తున్నట్లు తెలిపారు.

చేయి కదిపితే అద్భుత చిత్రాలు

- మోహనలక్ష్మి ప్రతిభ సమ్మోహనం
- పెన్సిల్‌తో మనోహర రూపాలు

ముత్తుకూరు : బాల్‌పెన్ను, పెన్సిల్ ఉంటే చాలు ఆమె చేతులు మనోహరమైన చిత్రాలను ఆవిష్కరిస్తాయి. అబ్బుర పరిచే బొమ్మలు రూపుదిద్దుకుంటాయి. ముత్తుకూరుకు చెందిన చందా మోహనలక్ష్మి బొమ్మలు గీయడంలో సిద్ధహస్తురాలు. చెన్నై సమీపంలోని కవర్‌పేటలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న మోహనలక్ష్మి రెండేళ్లుగా బొమ్మలు గీస్తోంది. ఊహల్లో మెదిలే భావాలు, ఆలోచనలకు అందమైన రూపం ఇస్తోంది. తెలుగు లోగిళ్లలో చేసుకునే పండగలే కాకుండా ముస్లింలు, క్రైస్తవుల పండగలకు కూడా మనోహరమైన చిత్రాలను గీసి, మిత్రులు, బంధువులు, సన్నిహితులకు కానుకగా పంపిస్తోంది. కిరాణాషాపు నిర్వహించే తండ్రి చందా వెంకటస్వామి ఇచ్చే ప్రోత్సాహంతో జాతీయ జెండా, లోటస్‌మహల్, ఎర్రకోట, తాజ్‌మహల్, గేట్‌వే ఆఫ్ ఇండియా తదితర చిత్రాలను గీసి, తన సామర్థ్యాన్ని చాటుకుంది. కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు ఆశ్చర్యపరిచేలా చిత్రాలు రూపొందించి, చిత్రకళల పోటీలకు వెళ్లగలిగే స్థాయికి చేరుకుంది.

ముచ్చట గొలిపేలా..

పురాణాలకు చెందిన శ్రీవినాయకుడు, శ్రీనివాసుడు, దుర్గాదేవి, హనుమాన్, స్వాతంత్ర సమర యోధులు, దేశ ప్రముఖులు, ప్రేమికులు, అందమైన పుష్పాలు, ప్రకృతి సోయగాలు, ముచ్చట గొలిపే లోగిళ్ల చిత్రాలే కాకుండా పచ్చదనం–పర్యావరణ పరిరక్షణ, నీటి విలువ తదితర సామాజిక స్పృహ ఉన్న బొమ్మలను కూడా చిత్రించిన మోహనలక్ష్మి తనలోని సృజనాత్మకతను చాటుకుంది. ఇప్పటికే 30కి పైగా బొమ్మలను చిత్రీకరించింది, కన్నవాళ్లు, బంధువుల ప్రేమానురాగాలు పొందింది.



బొమ్మ గీస్తున్న మోహనలక్ష్మి



వినాయకచవితికి గీసిన చిత్రం



స్వాతంత్ర్య దినోత్సవ చిత్రం



విజయదశమి ఉట్టిపడేలా..



ప్రేమికుల రోజును వివరిస్తూ..

గొప్ప చిత్రకారిణి కావాలన్నదే లక్ష్యం

ఆర్టిస్ట్‌గా విద్యార్థి దశలో ఉన్నాను. ఎందరో ప్రముఖులు వేసిన బొమ్మలు, ఆవిష్కరణలను పరిశీలిస్తున్నాను. వాటిలోని నైపుణ్యాన్ని, మెళకువలను తెలుసుకుంటున్నాను. చదువులో రాణించడంతో పాటు మంచి చిత్రకారిణిగా గుర్తింపు పొందాలన్నదే నా ఆకాంక్ష.

– సి.మోహనలక్ష్మి



ఆరోగ్య సురక్షతో చెంతకే వైద్యసేవలు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల చెంతకే వైద్యసేవలు అందుబాటులోకి వచ్చిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని 39, 40 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, స్థానికంగా వైద్య శిబిరం నిర్వహించి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు, మందులు, కంటి అద్దాలను సైతం ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామీణ స్థాయిలో వైద్యసేవలు అందుతున్నట్లు తెలియజేశారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌ఓలు, ఇతర సిబ్బంది చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న ఉచిత చికిత్సలు, అనుబంధ ఆస్పత్రుల వివరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అనారోగ్యంతో బాధపడే వారిని గుర్తించి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం ద్వారా వారు అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందిన తర్వాత సంబంధిత పేషెంటుకు అవసరమైన మందులు అందేలా తగిన రీతిలో ఆరోగ్య సురక్ష ద్వారా మ్యాపింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, డేగా రాము యాదవ్, వీఎంఎస్‌ఆర్ మాలి, మునీర్, నందనవనం సీతామహాలక్ష్మి, కుందుర్తి శ్రీనివాసులు, పొనుగోటి అనూరాధ, కనుపర్తి రాజశేఖర్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, బండారు మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

తహసీల్దార్ కార్యాలయంలో జేసీ తనిఖీలు

ఆత్మకూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జేసీ కూర్మనాథ్ ఆకస్మిక తనిఖీలను బుధవారం నిర్వహించారు. మండలంలోని దేపూరులో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న నూతన రెవెన్యూ డివిజన్ కార్యాలయ భవనాలను ఆత్మకూరు ఆర్డీఓ మధులతతో కలిసి పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం బ్రిటిష్ హయాం నాటిదని, చిన్నపాటి వర్షానికే రికార్డులు తడిచిపోతున్నాయని వారు జేసీకి తెలియజేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. తహసీల్దార్ జగదీష్‌బాబు, డీటీ రాజేష్, సీసీ అనిల్‌కుమార్‌యాదవ్, ఆర్‌ఐ పృథ్వీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణానికి రూ.19 లక్షల మంజూరు

కొడవలూరు : మండలంలోని గండవరంలో ఉన్న ఆరో మైలులో సాగునీటి కాలువపై వంతెన నిర్మాణానికి కలెక్టర్ ఎం.హరినారాయణన్ రూ.19 లక్షల జెడ్పీ నిధులను మంజూరు చేశారు. ఈ వంతెన పూర్తిగా కూలిపోవడంతో ఆయకట్టు రైతులు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను గతంలో కలిసి వంతెన నిర్మాణానికి విన్నవించుకున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేసేలా కృషి చేశారు. ఈ మేరకు మంజూరు పత్రాలను నెల్లూరులోని ఆయన నివాసంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీటీసీ సభ్యుడు పెనాక శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, అల్లం సత్యంలకు బుధవారం అందజేశారు.



మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

పశుక్షేత్ర అభివృద్ధికి కృషి

కొండాపురం : నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్(పశుక్షేత్ర) అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. మండలంలోని చింతలదేవిలో ఉన్న జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రంలో పిండోత్పత్తి విధానంపై శిక్షణ పొందడానికి వచ్చిన వైద్యులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గుంటూరులో ఉన్న లామ్‌ఫాం, చింతలదేవిలో ఉన్న కామధేను కేంద్రాల్లో పిండ మార్పిడి పద్ధతి ద్వారా మేలురకమైన పశు జాతులను ఉత్పత్తి చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. ఈ కేంద్రాల్లోని ల్యాబ్‌లో అభివృద్ధి చేసి పిండాలను రైతులకు అందిస్తామని తెలిపారు. ఈ కేంద్రాలు ప్రారంభం నుంచి ఇప్పటివరకు 30 పశువుల్లో నిర్ధారణ పరీక్షలు జరిగాయని, త్వరలోనే కాన్పు జరుగుతుందన్నారు. తిరుపతి, ఆదోని, బాపట్ల, నెల్లూరు జిల్లాల నుంచి ఐదుగురు వైద్యులు కామధేను బ్రీడింగ్ సెంటర్ ల్యాబ్‌లో పిండ మార్పిడి శిక్షణకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. దేశీయ పశుజాతులను రక్షించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ఈ వైద్యులకు ఏడు రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఒక్కొక్కరికీ అభివృద్ధి చేసిన పది పిండాలను ఇవ్వనున్నట్లు చెప్పారు. వీటిని శిక్షణ పొందిన వైద్యులు ఆయా జిల్లాల్లో రైతులకు అందజేసి అక్కడ అభివృద్ధి చేస్తారని చెప్పారు. జిల్లాలోని రైతులు తమ ఆవులు, గేదెల్లో పిండాలను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఉచితంగానే అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి కామధేనుకు రావాల్సిన నిధులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీడీలు సోమయ్య, పెద్దిస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయకుమార్

26న మహా కార్తీక దీపోత్సవం



నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన సమీపంలోని గణేష్ ఘాట్ వద్ద మహా కార్తీక దీపోత్సవాన్ని నవంబర్ 26న నిర్వహించనున్నామని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు వెన్నెల పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన విస్తృత స్థాయి సమావేశాన్ని రామ్మూర్తినగర్‌లోని ఎస్సార్ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. గో పూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి మహాశివలింగ ప్రతిష్ఠ, రుద్రాభిషేకం, రుద్రహోమాలు, గంగాహారతి, ఆకాశదీపం, మహాకార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామని వెల్లడించారు. సమితి ప్రధాన కార్యదర్శులు రాజేశ్వరి, బయ్యా మల్లిక, సుజాత, కోడూరు జయప్రద, ముక్కాల వ్యాసప్రసాద్, సుబ్రహ్మణ్యం, కోడూరు జయరామ్, రమేష్‌ఆచారి, మోహన్‌రావు, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా సహకార సమాఖ్య పథకం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సహకార సమాఖ్య పథకాన్ని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని డీసీసీబీ సీఈఓ సరిత పేర్కొన్నారు. గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీ ప్రధాన పరిపాలన కార్యాలయం నుంచి జిల్లాలోని బ్యాంక్ బ్రాంచ్‌లు, సొసైటీ సీఈఓలతో బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ పథకాన్ని విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రంలోని 13 డీసీసీబీలు, ఆప్కాబ్, సొసైటీలు కలిసి ఏడు లక్షల కరెంట్, సేవింగ్స్ ఖాతాలను డీసీసీబీలో చేయించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలను ప్రారంభించనున్నామని వివరించారు. జిల్లాలో 50 వేల బ్యాంక్ ఖాతాలను నూతనంగా ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నామని వెల్లడించారు.



మాట్లాడుతున్న సరిత

గౌతమ్‌రెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పరిశీలన



నెల్లూరు(దర్గామిట్ట): దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని నగరంలోని డైకస్‌రోడ్డు సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విగ్రహావిష్కరణకు వచ్చే ప్రజలు, నేతలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.